డబ్బు.. డబ్బు.. డబ్బు



- ప్రలోభాలు ముమ్మరం చేసిన అధికార పార్టీ
- భారీగా మద్యం చేరవేతకు పావులు
- ఓటర్లకు గాలం వేస్తున్న వైసీపీ నేతలు
- ముగిసిన ఎన్నికల ప్రచార సందడి

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి తెరపడింది. నిబంధనల మేరకు శనివారం సాయంత్రం ఆరు గంటల నుంచి అన్నిపార్టీల అభ్యర్థులు ఎన్నికల ప్రచారాన్ని ముగించారు. అధికార పార్టీ నేతలు ప్రలోభాలకు సిద్ధమయ్యారు. జిల్లాలో శ్రీకాకుళం పార్లమెంట్‌తో పాటు ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, నరసన్నపేట, పాతపట్నం, ఆమదాలవలస, శ్రీకాకుళం, ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈ నెల 13న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఆఖరిరోజున శనివారం ఉదయం నుంచీ సాయంత్రం వరకు టీడీపీ, జనసేన, బీజేపీ, వైసీపీ నేతలు ముమ్మర ప్రచారం చేశారు. ప్రచారం ముగియడంతో అభ్యర్థులు పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి సారించారు. పోలింగ్‌కు ఒక్కరోజు మాత్రమే గడువు ఉండడంతో.. ఓటర్లను మరింత ఆకట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో ఓటర్లకు డబ్బులు, మద్యం పంపకాలు చేపడుతున్నారు. ఇప్పటికే వలస ఓటర్లను స్వగ్రామాలకు రప్పించేలా ఏర్పాట్లు పూర్తిచేశారు. డబ్బు, మద్యం పంపిణీలో వైసీపీ నేతలు ముందంజలో ఉన్నారు. వైసీపీ ప్రభుత్వం ఈ ఐదేళ్లలో సంక్షేమ పథకాలు తప్ప.. ఎక్కడా అభివృద్ధి పనులు చేపట్టలేదు. రోడ్లు బాగుచేయలేదు. కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుట్టలేదు. ఇచ్చిన వాగ్దానాలు సక్రమంగా నెరవేర్చలేదు. గ్యాస్, పెట్రోల్, డీజిల్‌తోపాటు నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని తాకాయి. విద్యుత్ చార్జీలు ఏడుసార్లు, ఆర్టీసీ బస్సుచార్జీలు మూడుసార్లు పెంచారు. ఇలా అన్నింటా భారం మోపడంతో అన్నివర్గాల ప్రజలు వైసీపీ పాలనపై అసంతృప్తితో ఉన్నారు. కాగా.. అసంతృప్త ఓటర్లను డబ్బుతో కొనుగోలు చేసేందుకు వైసీపీ నేతలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

నియోజకవర్గాల్లో ఇదీ పరిస్థితి..

- పాతపట్నం నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి రెడ్డి శాంతి ఆధ్వర్యంలో డబ్బును మంచినీళ్ల మాదిరి ఖర్చు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇక్కడ వైసీపీలోనే కొంతమంది అసంతృప్తి వాదులు ఉన్నారు. వారికి తాయిలాలు అందించి.. అసంతృప్తి చల్లార్చే ప్రయత్నాలు సాగుతున్నాయి.
- ఇచ్ఛాపురం నియోజకవర్గం టీడీపీకి కంచుకోట. ఇచ్ఛాపురంలో ఇంతవరకూ వైసీపీ గెలిచిన దాఖలాలు లేవు. ఇక్కడ వైసీపీ అభ్యర్థి పిరియా విజయ గెలుపు కోసం పార్టీ అధినేత ప్రత్యేక దృష్టి సారించారు. రూ.20కోట్ల మేర పార్టీ ఫండ్ ఇచ్చి.. ఓటర్లకు పంపిణీ చేయాలని ఆదేశించినట్టు సమాచారం. కాగా.. ఈ డబ్బును సరిగా పంపిణీ చేయడం లేదని వైసీపీ ద్వితీయశ్రేణి నాయకులు ఆరోపిస్తున్నారు.
- పలాసలో కోవర్టుల ద్వారా టీడీపీ అభ్యర్థిపై దుష్ప్రచారం చేసేందుకు వైసీపీ నాయకులు యత్నించారు. కానీ విఫలమయ్యారు. ఇక్కడ వైసీపీ అభ్యర్థి సీదిరి అప్పలరాజు.. ముందస్తుగా డబ్బులు పంపిణీ చేశారు. ప్రత్యర్థులపై మరింత నిఘా పెట్టారు. సొంతపార్టీలోనే అప్పలరాజుకు అసమ్మతి పెరగడంతో.. డబ్బులు పంపిణీ చేసినా.. ఫలితముండదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.
- టెక్కలిలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడిని ఓడించాలంటే డబ్బుతోనే ఓట్లను కొనుగోలు చేయాలని వైసీపీ యోచించింది. ఇక్కడ వైసీపీ అభ్యర్థిగా దువ్వాడ శ్రీను పోటీ చేస్తుండడంతో అచ్చెన్న గెలుపు మరింత సునాయసమని నియోజకవర్గ ప్రజలు చెబుతున్నారు. ఎలాగైనా అచ్చెన్నను ఓడించేందు వైసీపీ.. ఇప్పటికే రూ.25 కోట్లు పార్టీ ద్వారా, మరో రూ.20కోట్లు పోర్టు కాంట్రాక్టర్ ద్వారా సమకూర్చినట్టు సమాచారం. కానీ రోజురోజుకి వైసీపీని వీడి నాయకులు టీడీపీలో చేరిపోతున్నారు. డబ్బులు పంపిణీ చేసేందుకు కూడా అనుచరులు లేరనే సమాచారం.
- ఆమదాలవలసలో స్పీకర్ తమ్మినేని సీతారాం గెలుపుకోసం పార్టీ అధిష్ఠానం రూ.20 కోట్లు ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఇక్కడ వైసీపీకి చెందిన నాయకుడొకరు ఇండిపెండెంట్‌గా పోటీలో నిల్చుని వైసీపీ ఓట్లకు గాలం వేస్తున్నారు. డబ్బుల పంపిణీలో వెనుకంజలో ఉన్నట్లు తెలిసింది.
- శ్రీకాకుళంలో వార్ వన్‌సైడ్ మాదిరిగా టీడీపీకి అవకాశం లభించింది. 2019 ఎన్నికల్లో అతితక్కువ ఓట్లతో వైసీపీ అభ్యర్థి ధర్మాన ప్రసాదరావు గట్టెక్కారు. ప్రస్తుతం మళ్లీ ఆయనే బరిలో దిగగా.. అధిష్ఠానం నుంచి ఏవిధమైన ఆర్థిక సహకారం అందించలేదని విశ్వసనీయసమాచారం. టీడీపీ అభ్యర్థి గొండు శంకర్‌కు అంతటా జన నీరాజనం పడుతున్నారు. వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు కూడా పెరిగాయి. దీంతో ధర్మాన ఆచితూచి డబ్బులు ఖర్చుచేయాలా వద్దా అన్న మీమాంసలో ఉన్నారు.
- నరసన్నపేటలో వైసీపీ అభ్యర్థి ధర్మాన కృష్ణదాస్.. సొంతపార్టీ నేతల నుంచే అంతర్గత యుద్ధం ఎదుర్కొంటున్నారు. పార్టీ అధిష్ఠానం నుంచి రూ.కోట్లు చేరినా.. పంపిణీ విషయంలో వెనకడుగు వేస్తున్నట్లు తెలిసింది.
- ఎచ్చెర్లలో పరిస్థితి ఇతర నియోజకవర్గాల కంటే భిన్నంగా ఉంది. ఇక్కడ కూటమి తరపున బీజేపీ అభ్యర్థి ఎన్ఈఆర్ పోటీ చేస్తున్నారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొర్లె కిరణ్.. కులం కార్డు వాడుతూ.. ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తూ తనను మరోసారి గెలిపించాలని కోరుతున్నారు. ఈ ఐదేళ్లలో ఎటువంటి ప్రయోజనం చేకూర్చకపోవడంతో ఆయా సామాజికవర్గాల ఓటర్లు బీజేపీ అభ్యర్థికే మద్దతు తెలుపుతున్నట్టు తెగేసి చెబుతున్నారు.

ఓటు వేయడం మన బాధ్యత

- పోలింగ్‌కు పండుగలా తరలిరండి
- జిల్లా ఎన్నికల అధికారి మన్‌జీర్ జిలానీ సమూన్



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్, మే 11: 'సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేయడం మన బాధ్యత. ఈ నెల 13న పోలింగ్ రోజు.. అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాల'ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం స్వీప్ కార్యక్రమంలో భాగంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 'నీ ఓటు నీ భవిష్యత్తు' అంటూ ఓటు హక్కు వినియోగంపై స్థానిక 80 అడుగుల రోడ్డులోని మిల్లు జంక్షన్ నుంచి నిర్వహించిన బైక్ ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. సూర్యమహల్, ఏడురోడ్ల జంక్షన్ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ .. పండుగలా భావించి ఓటర్లంతా పోలింగ్‌లో భాగస్వామ్యం కావాలని కోరారు. 2019 ఎన్నికల కన్నా ఓటింగ్ శాతం పెంచాలన్నారు. ర్యాలీలో జేసీ ఎం.నవీన్, సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఆర్డీవో సీహెచ్ రంగయ్య, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, ఎల్‌డీఎం సూర్యకిరణ్, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, ఎన్‌వైకె కోఆర్డినేటర్ వెంకట్ ఉజ్వల్, సమాచార పౌరసంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు, హౌసింగ్ పీడీ గణపతిరావు, వివిధ శాఖల ఉద్యోగులు, పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు.

పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు..

ప్రశాంతంగా పోలింగ్ నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. 'ఈ నెల 13న ఉదయం 7 గంటలకు సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రారంభమవుతుంది. సాయంత్రం 6 గంటలు దాటినా.. క్యూలో ఉన్న ఓటర్లకు ఓటు వేసే అవకాశం కల్పిస్తాం. జిల్లాలో 18,92,457 మంది ఓటర్లు ఉండగా.. 2,358 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశాం. 520 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి.. ప్రత్యేక నిఘా పెట్టాం. శనివారం సాయంత్రం 6 గంటల నుంచి ప్రచారాలు నిలిపివేయించి.. సైలెన్స్ పీరియడ్ అమలు చేస్తున్నాం. ఈ సమయంలో రాజకీయ నేతలు, కార్యకర్తలు ప్రచారాలు నిర్వహించరాదు. ఆది, సోమవారాల్లో మద్యం విక్రయాలు చేపట్టరాద'ని కలెక్టర్ ఆదేశించారు.



స్వగ్రామాలకు.. వలస ఓటర్లు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వలస ఓటర్లు స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, కోల్‌కత్తా తదితర ప్రాంతాల్లో జిల్లాకు చెందిన వేలాది మంది ఉపాధి పొందుతున్నారు. వారంతా సోమవారం ఓటు వేసేందుకు గానూ గ్రామాలకు తరలివస్తున్నారు. దీంతో రైల్వేస్టేషన్లు, కాంప్లెక్స్‌లు కిటకిటలాడుతున్నాయి. శనివారం ఆమదాలవలస రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ కనిపించింది.

- ఆమదాలవలస

వివరాలు -7లో



1,728 మద్యం సీసాలు లభ్యం

మెళియాపుట్టి, మే 11: మెళియాపుట్టి మండలం పట్టుపురం పోలీసు గేటు వద్ద శుక్రవారం రాత్రి ఓ ఆటోలో(ఏపీ 39, టీపీ 9913) 1,728 మద్యం సీసాలు పట్టుబడ్డాయని టెక్కలి, పలాస స్పెషల్‌ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు జీఎస్ రాజశేఖర్ నాయుడు, రామచంద్రకుమార్ తెలిపారు. ఒడిశా నుంచి ఈ మద్యం తరలిస్తున్నట్టు గుర్తించామన్నారు. 'పట్టుబడిన మద్యం విలువ రూ.2,76,480 ఉంటుంది. మెళియాపుట్టికి చెందిన నాగవంశం లక్ష్మణరావు పేరుతో ఆటో రిజిస్ట్రేషన్ అయి ఉంది. తాడేల షణ్ముఖరావు ఆటో నడుపుతూ మద్యం రవాణా చేస్తున్నాడు. ఆటోను సీజ్ చేసి.. వారిద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామ'ని సీఐలు చెప్పారు.



సూపర్ 6.. అదుర్స్

- సూపర్ సిక్స్ 2.0తోపాటు షణ్ముఖ వ్యూహం

ఇంటింటికీ రక్షిత తాగునీరు, పూర్ టు రిచ్, యాభై ఏళ్లకే బీసీలకు పెన్షన్, బ్రాహ్మణుల సంక్షేమం, మైనార్టీలు, న్యాయవాదులు, క్రైస్తవులు, ఇలా అన్నివర్గాల ప్రజలకోసం ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించారు. పరిశ్రమలు ఏర్పాటు.. స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించడం. మహిళా సంఘాలకు వడ్డీ లేకుండా రూ.10లక్షల వరకు రుణాలు.. ఉద్యోగస్తులు, పెన్షనర్స్‌కు కూడా పలు ప్రయోజనాలు కల్పించేలా మేనిఫెస్టోలో పొందుపరిచారు. నేతకార్మికులు, మత్స్యకారులు, యాదవులు ఇలా.. ఇతరత్రా వర్గాలకు వేర్వేరుగా అమలుచేసే కార్యక్రమాలు చాలా ఉన్నాయి. ఈ నేపథ్యంలో అన్నివర్గాల ప్రజలు కూటమికి జై అంటున్నారు.

- గ్రామగ్రామాన చేరిన ఎన్డీయే కూటమి ప్రచారం
- టీడీపీ-జనసేన-బీజేపీ మేనిఫెస్టో అద్భుతమంటున్న జనం
- పథకాలపై మహిళల ఆసక్తి
- మెగా డీఎస్సీ కోసం యువత ఆశలు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

'సూపర్ సిక్స్'.. ఇప్పుడు ప్రతిఒక్కరి నోట ఇదే మాట. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం చేసేలా.. ఆరు ప్రత్యేక హామీలను ప్రకటించారు. తాము అధికారంలోకి రాగానే.. ఈ ప్రత్యేక పథకాలు అమలు చేయనున్నట్టు విస్తృత ప్రచారం చేశారు. అలాగే జనసేనాని ప్రతిపాదించిన 'షణ్ముఖ వ్యూహం' అంశాలు కూడా ఇందులో చేర్చారు. మరోవైపు టీడీపీ, జనసేనకు బీజేపీ కూడా మద్దతు ఇవ్వడంతో.. అన్నివర్గాల ప్రజలను ఆదుకునేలా సమగ్ర మేనిఫెస్టోలో పొందుపరిచారు. చిన్నారులను, మహిళలను, వృద్ధులను, నిరుద్యోగులను, ఉద్యోగులను సైతం లబ్ధి కలిగేలా మేనిఫెస్టో ఉండడంతో ప్రజలంతా 'సూపర్ సిక్స్'.. అదుర్స్ అని కితాబునిస్తున్నారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తే తమకు మేలు జరుగుతుందని భావిస్తున్నారు.

● యువతకు 20లక్షలు ఉద్యోగాలు.. నిరుద్యోగ భృతి..

యువత ఉపాధి కోసం వలసబాట పడుతున్నారు. ఈ ఐదేళ్లు ఒక్క డీఎస్సీ కూడా భర్తీచేయలేదు. సూపర్‌సిక్స్‌లో భాగంగా యువతకు ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చంద్రబాబు ప్రకటించారు. నిరుద్యోగులకు రూ.3వేలు భృతి ఇస్తామన్నారు. అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీపైనే తొలిసంతకం చేస్తామని ప్రకటించారు. దీంతో యువత భారీ ఆశలు పెంచుకుంది.

● ప్రతిరైతుకు రూ.20వేలు

జిల్లాలో చాలామంది రైతులు ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతున్నారు. అప్పులపాలై ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఒక్కో రైతుకు ఆర్థికసాయంగా ఏటా రూ.20వేలు అందజేస్తామని చంద్రబాబు హామీ ఇవ్వడంతో వారంతా ఊరట చెందుతున్నారు.

● మహిళలకు నెలకు రూ.1,500

19 ఏళ్ల నుంచి 59 ఏళ్ల లోపు మహిళలకు నెలకు రూ.1500చొప్పున ఇస్తామని చంద్రబాబు ప్రకటించారు. దీనివల్ల ప్రతి ఇంట్లోనూ మహిళలకు భారీ ప్రయోజనం కలుగుతుంది.

● ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15వేలు..

వైసీపీ ప్రవేశపెట్టిన అమ్మఒడి పథకంలో కేవలం ఇంటిలో ఒకరికి మాత్రలే లబ్ధి కలిగేది. రూ.15వేలు అనిచెప్పి రూ.13వేలు మాత్రమే ఇచ్చేవారు. ఈ ఏడాది అమ్మఒడి డబ్బులను ఎగనామం పెట్టేశారు. కూటమి అధికారంలోకి వస్తే 'తల్లికి వందనం' పథకం కింద ఇంట్లో ఎంతమంది చిన్నారులున్నా.. పాఠశాలకు ప్రతి ఒక్కరికీ రూ.15వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేయనున్నారు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● ఉచితంగా మూడు సిలెండర్లు..

ఒక్కో కుటుంబానికి ఏడాదికి 3 గ్యాస్‌సిలెండర్లు ఉచితంగా ఇవ్వనున్నట్టు చంద్రబాబు ప్రకటించారు. దీనివల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలకు భారీ ఊరట లభించనుంది.

● ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం...

తెలంగాణ మాదిరి ఆంధ్రాలోనూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించనున్నట్టు చంద్రబాబు ప్రకటించారు. దీనిపై యువతులు, విద్యార్థినులు, గృహిణులు, ఉద్యోగినులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇంతకంటే ఇంకేం కావాలి



కొలువు కోసం ఎదురుచూస్తున్నాం. ఐదేళ్ల నుంచి డీఎస్సీ లేదు. అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీపైనే సంతకం చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇంతకంటే ఇంకేం కావాలి మాకు.

- లండ హేమంత్‌రామ్, నిరుద్యోగి

ఆసక్తి పెరిగింది



సూపర్ సిక్స్ పథకాలపై అందరికీ ఆసక్తి పెరిగింది. ప్రతి కుటుంబానికి ఆర్థికంగా భరోసా కల్పించేలా టీడీపీ ఆలోచించింది. ఈ పథకాల వల్లనే ఎన్డీఏ కూటమికే జై అంటున్నాం.

- పెంకి నాగేశ్వరరావు, శ్రీకాకుళం

ఎంతో భారం తగ్గుతుంది



ఐదేళ్లలో నిత్యావసరాల ధరలు బాగా పెరిగిపోయాయి. ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తే.. మాలాంటి కుటుంబాలకు ఎంతో ఆర్థిక భారం తగ్గుతుంది.

- కొమ్మనాపల్లి మాలతి, గృహిణి, శ్రీకాకుళం

హర్షణీయం



టీడీపీ అధికారంలోకి వస్తే ఒక్కో మహిళకు రూ.1500 ఇస్తామని చెప్పడం హర్షణీయం. ఇంటి నిర్వహణకు.. ఇతరత్రా ఖర్చులకు మాకు ఆ డబ్బులు వినియోగపడతాయి.

- డి.పద్మావతి, నందికొంగకాలనీ, సరుబుజ్జిలి

ఎంతో సంతోషం



ఏటా రైతుకు రూ.20వేలు ఆర్థికసాయం, బీసీలకు యాభై ఏళ్లకే పెన్షన్ ప్రకటించడం సంతోషంగా ఉంది. టీడీపీకే మేమంతా ఓటు వేయాలని నిర్ణయించుకున్నాం.

- మీసాల ధనంజయరావు, తురకపేట

ఓటు.. మూడు కొండలు

- వినియోగించాలనుకుంటే దిగక తప్పదు
- దూరభారంగా పోలింగ్ కేంద్రాలు
- కానరాని సౌకర్యాలు.. ఆందోళనలో ఓటర్లు



చందనగిరి నుంచి ఈ కొండలు దిగాల్సిందే



నేలబొంతు పోలింగ్ కేంద్రం

- మెళియాపుట్టి మండలం చందనగిరి గ్రామం లో 150 మంది ఓటర్లు ఉన్నారు. ఈసారి సార్వ త్రిక ఎన్నికల్లో పోలింగ్ కేంద్రంగా నెలబొంతు ఆశ్రమ పాఠశాలను కేటాయించారు. చందనగిరి నుంచి ఇక్కడకు చేరుకోవాలంటే మూడు కొండలు దిగి రావాల్సిందే. చందనగిరిలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని స్థానిక గిరిజనులు కోరుతున్నారు. కాగా.. అది మావోయిస్టు ప్రభావిత ప్రాంతంతోపాటు అక్కడ ప్రభుత్వ భవనాలు లేక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయలేకపోతున్నామని రెవెన్యూ అధికారులు, పోలీసులు చెబుతున్నారు. దీంతో గత్యంతరం లేక ఓటు వేసేందుకు కొండలు దిగి రావాల్సిన పరిస్థితి నెలకొందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- మెళియాపుట్టి మండలం **అనంతగిరి పోలింగ్ కేంద్రం**లో 200 మంది ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. ఇక్కడ తాగునీటి వసతి, మరుగుదొడ్లు లేవు. రహదారి కూడా బాగోలేక వాహనాలు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.



- మెళియాపుట్టి మండలం **గూడ గ్రామం**లో 120 మంది ఓటర్లు ఉన్నారు. వీరు ప్రతి ఎన్నికల్లోనూ కేరాశింగి పోలింగ్ కేంద్రా నికి వచ్చి ఓట్లు వేస్తున్నారు. గూడ నుంచి కేరాశింగికి చేరుకోవాలంటే.. కొండపై నుంచి నాలుగు కిలోమీటర్లు దిగిరావాల్సిందే.



(మెళియాపుట్టి)

..ఇలా జిల్లాలోని చాలా గిరిజన ప్రాంతాల్లో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలంటే ఆపసోపాలు పడాల్సిందే. ఎన్నికల ప్రక్రియ ప్రారంభానికి ఆరు నెలలముందే పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్, రెవెన్యూ అధికారులు ఆదేశించారు. ప్రతి కేంద్రంలోనూ విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, రహదారి సౌకర్యం ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. కాగా.. కొంతమంది అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే కేంద్రాల్లో సౌకర్యాలు బాగానే ఉన్నట్టు నివేదిక ఇచ్చారు. దీంతో ఓటర్లకు ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాలో 2,048 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా.. మారుమూల గ్రామాల్లో సౌకర్యాలు కనిపించడం లేదు. గిరిజన ప్రాంతాల్లోని చాలా పోలింగ్ కేంద్రాల్లో తాగునీటి వసతి, మరుగుదొడ్లు లేవు. దివ్యాంగుల కోసం ప్రత్యేక ర్యాంపులు కూడా ఏర్పాటు చేయలేదు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించలేని పరిస్థితి నెలకొంది. పాఠశాల నిర్వహణకే నిధులు లేక ఇబ్బందులు పడుతుండగా.. పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు ఎలా నిర్మించగలమని సిబ్బంది చెబుతున్నారు. దీంతో ఓటర్లు ఆందోళన చెందుతున్నారు.

● కలెక్టర్ చెప్పినా అంతే..

మెళియాపుట్టి మండలంలో మార్చి 21న కలెక్టర్ మన్‌జీర్‌జిలానీ సమూన్ పర్యటించారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మెళియాపుట్టి పోలింగ్ కేంద్రానికి ఓటర్లు వచ్చేందుకు ఇబ్బందులు ఉన్నాయని గుర్తించారు. ఈ మార్గాన మట్టిపోసి రహదారి సౌకర్యం కల్పించాలని సూచించారు. కానీ నేటికీ పనులు చేపట్టలేదు. రెవెన్యూ అధికారులు పనుల బాధ్యతను పాఠశాల సిబ్బందికి అప్పగించగా.. డబ్బుల్లేవంటూ వారు చేతులెత్తేశారు.

ఓటు గుర్తింపు కార్డుకు.. 12 ప్రత్యామ్నాయ కార్డులు

నందిగామ: ఓటు గుర్తింపుకార్డుకు బదులుగా 12 ప్రత్యామ్నాయ గుర్తింపుకార్డులను వినియోగించుకోవచ్చని ఎన్నికల అధికారులు సూచించారు. ఆధార్, ఉపాధి హామీ జాబ్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్, హెల్త్ ఇన్సూరెన్స్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, పాస్‌పోర్టు, దివ్యాంగుల గుర్తింపు కార్డు, సర్వీస్ గుర్తింపుకార్డు, ఉద్యోగి గుర్తింపుకార్డు వాటితో ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోవచ్చని తెలిపారు. ఏ ఒక్కరు కంగారు పడాల్సిన అవసరం లేకుండా పైన పేర్కొన్న ఏ ఒక్క కార్డయినా తీసుకువచ్చి ఓటువేయవచ్చని చెప్పారు.

పోలింగ్‌లో పీవోలే కీలకం




- ఏపీవోలు కూడా అప్రమత్తంగా ఉండాల్సిందే
- పీడీఎంఎస్ యాప్‌తో ఎన్నికల నిర్వహణ
- మార్గదర్శకాలు జారీచేసిన ఎన్నికల సంఘం

(నరసన్నపేట)

పోలింగ్ కేంద్రాల్లో ప్రిసైడింగ్ అధికారులే (పీవో) కీలకం. వారి ఆధీనంలోనే పోలింగ్ కేంద్రాలు ఉంటాయి. ఇక్కడ వారిదే తుది నిర్ణయం. ఈవీఎంల మార్పు, పోలింగ్ నిలుపుదల, కొనసాగింపు, వాయిదా, భద్రత, పోలింగ్ ఏజెంట్లపై చర్యలు, చాలెంజ్ ఓటుపై ప్రిసైడింగ్ అధికారులదే తుది నిర్ణయం. సోమవారం జరిగే పోలింగ్‌నకు ఇప్పటికే పీవోలు, ఏపీవోలకు నాలుగు సార్లు శిక్షణ ఇచ్చారు. పోలింగ్ ముందురోజు నుంచి పోలింగ్ పూర్తయిన తర్వాత ఈవీఎంలను స్ట్రాంగ్‌రూము కౌంటర్లకు అప్పగించే వరకూ పూర్తి బాధ్యతలను అప్పగించారు. ఎన్నికల విధులు ఏ విధంగా నిర్వహించాలి, ఎలా చేపట్టాలి అన్న విషయంపై పీవోలు, ఏపీవోలు అనుసరించాల్సిన విధానాలను ఎన్నికల సంఘం మార్గదర్శకాలను జారీచేసింది. పీవోలు, ఏపీవోలు పోల్‌డే మానటరింగ్ సిస్టం యాప్‌తో అనుసంధానం చేస్తూ విధులు నిర్వహించాలి.

పోలింగ్ ముందు రోజు..

- ఎన్నికల విధుల్లో పాల్గొన్న పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు ఇతర సిబ్బంది తమకు కేటాయించిన నియోజకవర్గంలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి ఉదయం 8 గంటలకు చేరుకోవాలి. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం ఏ సెక్టోరియల్ పరిధి, పోలింగ్‌కు ఎక్కడ కేటాయించారో సమాచారాన్ని కేంద్రాల్లో తెలుసుకోవాలి.
- తర్వాత సెక్టోరియల్ అధికారులకు రిపోర్టు చేసి వారికి ఇచ్చిన సామగ్రిని తీసుకోవాలి. ఈ సామగ్రి చెక్‌లిస్టును ఒకటికి రెండు సార్లు పరిశీలించాలి. ఏదైనా లేక పోతే సెక్టోరియల్ అధికారికి తెలియజేస్తే వారికి సామగ్రి అందజేస్తారు. వాహనాలు బయలుదేరిన సమయంలో పీడీఎంఎస్ యాప్ ద్వారా గమ్యస్థానం వివరాలు తెలియజేసి యాప్‌ను వినియోగించడం ప్రారంభించాలి.
- డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి పోలింగ్ కేంద్రాలకు చేరిన తర్వాత ఫారం-7ఏ పోటీచేసే అభ్యర్థుల వివరాలు పోస్టర్ అంటించాలి.
- ఫారం-10 ఏజెంట్ల నుంచి వారి నియామకపు లేఖలు తీసుకోవాలి.
- ఎనక్షర్12 - ఏజెంట్లకు ఎంట్రీ పాస్‌లు ఇవ్వాలి.
- ఎనక్షర్-13 - ఏజెంట్ల ఎంట్రీ పాస్‌ల ఖాతా రాయాలి.



పోలింగ్ ప్రారంభానికి ముందు..

- పీడీఎంఎస్ యాప్ ఓపెన్ చేసి పోలింగ్ స్టేషన్, నెంబరు, మండలం, నియోజకవర్గం తదితర వివరాలను యాప్‌లో నిక్షిప్తం చేయాలి
- మాక్‌పోల్ టాలీషీట్స్ తయారుచేసుకోవాలి (అసెంబ్లీ, పార్లమెంట్లకు విడివిడిగా) తర్వాత బీయూను వీవీప్యాట్‌కు, వీవీప్యాట్‌ను కంట్రోల్ యూనిట్ (సీయూ)కు ఉదయం 5.30 గంటలకు కనెక్ట్ చేయాలి. వీవీప్యాట్ వెనుకఉన్న నల్లటి మీటను నిలువుగా తిప్పి సీయూ ఆన్‌చేయాలి. అనంతరం మాక్‌పోల్‌ను ప్రారంభించాలి. ఈ పోలింగ్‌లో వీవీప్యాట్ నుంచి జారిన ఏడు స్లిప్పులను చూడాలి. క్లోజ్ రిజల్ట్ క్లియర్(సీఆర్సీ)చేయాలి. తర్వాత పోటీలోని అభ్యర్థులకు నోటాతో కలిపి సమానంగా 50 ఓట్లను ఏజెంట్లతో వేయించాలి. (అసెంబ్లీ, పార్లమెంట్‌కు విడివిడిగా, ఒకేసమయంలో).
- 50 ఓట్లు వేసిన తర్వాత క్లోజ్ బటన్ నొక్కాలి. ఆపై రిజల్ట్ బటన్ నొక్కాలి. ఎనక్షర్ -5 పార్ట్:1 మాక్ పోల్ సర్టిఫికెట్ నింపాలి. తర్వాత సీయూలో క్లియర్ బటన్‌నొక్కాలి. ఆపై టోటల్ బటన్ నొక్కి సున్నాచూపాలి. తర్వాత కంట్రోల్ యూనిట్ స్విచ్ ఆఫ్ చేయాలి. దీంతో మాక్ పోలింగ్ పూర్తవుతుంది. వీవీప్యాట్‌లో నుంచి మాక్‌పోల్ స్లిప్ (57) తీసివేసి లెక్కించి స్లిప్‌లు వెనుక మాక్‌పోల్ అన్న స్టాంప్ వేసి కవర్ లో పెట్టిసీల్‌చేయాలి. పీవో ఈ కవర్‌పై ఏజెంట్లతో సంతకం చేయించాలి.
- సీయూను గ్రీన్‌పేపర్ సీల్ (ఎబి), క్లోజ్ బటన్ వద్ద స్పెషల్ ట్యాగ్‌తో సీల్‌చేయాలి. వాటి మీద ఉన్న నంబర్లను రాసుకోవాలి. వాటిపై పీవో, ఏజెంట్ సంతకాలు చేయాలి. సీయూకు పక్కన అడ్రాస్ ట్యాగ్ కట్టాలి. వీవీప్యాట్‌లోని స్లిప్పులు జారిపడే గది తలుపునకు ఇరువైపుల అడ్రాస్ ట్యాగ్‌కట్టి సీల్ వేయాలి.

ఇలా పోలింగ్ ప్రారంభం..

- ఉదయం ఏడు గంటలకు సీయూ స్విచ్ ఆన్ చేయాలి. (అసెంబ్లీ, పార్లమెంట్ సీయూలు ఒకేసారి) వీవీప్యాట్‌లో జారిపడే ఏడు స్లిప్పులను ఏజెంట్లను పరిశీలించాలని చెప్పాలి. తర్వాత టోటల్ బటన్ నొక్కి మొత్తం ఓట్లు సున్నా అనిచూపి పోలింగ్‌ను ప్రారంభించాలి. పీవో ఎనక్షర్-6లో పోలింగ్ ప్రారంభించామని రాయాలి. అనంతరం పోలింగ్ ప్రారంభించాలి.
- ఏపీవో మార్కు కాపీ పనిచూడాలి. ఓపీవో-1 17ఏ ఓటర్ల రిజిస్టర్ రాసి ఇంక్‌పెట్టాలి. ఓపీవో-2 ఓటరు స్లిప్పులు రాయాలి. ఓపీవో-3 పార్లమెంట్ కంట్రోల్ యూనిట్ బాధ్యత. ఓపీవో -4 అసెంబ్లీ కంట్రోల్ యూనిట్ బాధ్యత. పీవో ప్రతి రెండు గంటలకు పోలింగ్ అయిన ఓట్లను నమోదు చేసుకోవాలి.
- పోలింగ్ పూర్తయిన తర్వాత టోటల్ బటన్ నొక్కి ఓట్ల సంఖ్య సరిచూసుకోవాలి. తర్వాత క్లోజ్ బటన్ నొక్కాలి. ఎనక్షర్ -6 పార్ట్-3 పూర్తి చేయాలి.
- పీడీఎంఎస్‌లో పోలింగ్ పూర్తయినట్లు నమోదుచేయాలి. ఈవీఎంలను సీల్ చేయాలి
- ఎనక్షర్ -8 (ఫారం-17 సి) పూర్తి చేయాలి. ఏజెంట్ల అందరికీ కాపీలు ఇవ్వాలి.
- రిసెప్షన్ కేంద్రానికి చేరుకోగానే పీడీఎంఎస్ యాప్‌లో నమోదుచేయాలి. కౌంటర్ల వద్ద మెటీరియల్ ఇచ్చినట్లు ఎనక్షర్ -22 తీసుకోవాలి. పీవో డైరీలను అసెంబ్లీకి, పార్లమెంట్‌కు వేర్వేరుగా తయారుచేసి రెండుకాపీలు ఇవ్వాలి. అవసరమైన చోట ఎనక్షర్ -14, 15,16,18,19, 20లను పూర్తి చేయాలి. అలాగే ఇతర ఫారాలు పూర్తిచేసి ఇవ్వాలి.

కరెంట్ పోతే ఈవీఎం పనిచేయదా ?

కరెంట్‌పోతే ఈవీఎం పనిచేయదా? ఓటు వేసే సమయంలో కరెంట్ పోతే ఈవీఎం పని చేస్తుందా? లేదా అన్న సందేహాలు చాలామందిలో ఉండొచ్చు. అయితే భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ రూపొందించిన ఈవీఎంలు విద్యుత్ కనెక్షన్ లేకపోయినా పనిచేస్తాయి. సాధారణ 7.5 వోల్ట్ ఆల్కలిన్ పవర్‌ప్యాక్‌తో పనిచేస్తాయని ఆయా కంపెనీలు ప్రకటించాయి.

ఉదయం 5.30 నుంచి మాక్‌పోలింగ్..

అభ్యర్థుల తరఫున నియమించిన ఏజెంట్ల సమక్షంలో ఉదయం 5.30 నుంచి 6.30లోగా కనీసం 50 ఓట్లతో మాక్ పోలింగ్ నిర్వహించి ఓట్లను లెక్కిస్తారు. మాక్ పోలింగ్‌లో కూడా నోటా ఆప్షన్ ఉంటుంది. మాక్ పోలింగ్, ఓట్ల లెక్కింపులో ఏమైనా తేడాలు వస్తే సంబంధిత ఈవీఎంలను మార్చి కొత్త ఈవీఎంలను ఏర్పాటు చేస్తారు. మాక్ పోలింగ్ సక్రమమేనని నిర్ధారణ అయితే ఈవీఎంలను ఏజెంట్ల సమక్షంలోనే జీవో చేసి సరిగా ఉదయం ఏడుగంటలకు ప్రారంభిస్తారు.

రెండు గంటలకోసారి పోలింగ్ శాతం..

పోలింగ్ ప్రారంభించిన తర్వాత ప్రతి రెండు గంటలకొసారి అధికారులు పోలింగ్ శాతాన్ని వెల్లడిస్తారు. మార్కింగ్ చేసిన జాబితా, ఓటరు స్లిప్పులు, సీయూ లెక్కలను సరిచూసిన తర్వాతే పోలింగ్ శాతాన్ని ప్రకటిస్తారు. ఉదయం 9, 11, ఒంటిగంట, సాయంత్రం మూడు గంటలకు పోలింగ్ ముగిసిన తర్వాత తుది శాతాన్ని వెల్లడిస్తారు. ప్రిసైడింగ్ అధికారులు సెక్టారు అధికారుల ద్వారా జిల్లా అధికారులకు నమోదైన పోలింగ్ శాతాన్ని చేరవేస్తారు. అనంతరం జిల్లా ఎన్నికల అధికారులు ఎప్పటికప్పుడు తెలియజేస్తారు.

ప్రత్యేక గుర్తులతో మార్కింగ్..

పురుషులు, మహిళలు, ట్రాన్స్ జెండర్లు మూడు రకాలుగా ఓటర్లను విభజించారు. ఓటు వేసేందుకు వచ్చిన ఓటరు ఆధారంగా అదనపు ప్రిసైడింగ్ అధికారి ఓటరు జాబితాలో మార్కింగ్ చేస్తారు. పురుషులు వస్తే అడ్డగీత, మహిళలు వస్తే అడ్డగీతతో పాటు వారి ఓటరు క్రమసంఖ్యకు వృత్తం చుడతారు. ట్రాన్స్‌జెండర్లు వస్తే అడ్డగీతతో పాటు వారిక్రమ సంఖ్యకు స్టార్ గుర్తు వేస్తారు. ఈ విధానంతో కేటగిరి వారీగా పోలింగ్ శాతాన్ని లెక్కించడం సులువు అవుతుంది.

ఈవీఎంలు మొరాయిస్తే..

ఈవీఎంలు మొరాయిస్తే పోలింగ్‌కు అంతరాయం కలు గుతుంది. ఓటింగ్ జరగాలంటే ఈవీఎంలో కంట్రోల్ యూనిట్ (సీయూ)వీవీప్యాట్, బ్యాలెట్‌యూనిట్ (బీయూ) మూడు సక్రమంగా పనిచేయాలి. సీయూ, బీయూ పనిచేయకపోతే వాటితోపాటు వీవీప్యాట్‌ను మార్చి మాక్ పోలింగ్‌తో తనిఖీ చేస్తారు. సీయూ బ్యాటరీ, వీవీ ప్యాట్ పనిచేయకపోతే వాటిని మాత్రమే మారుస్తారు. మాక్‌పోలింగ్ అవసరం ఉండదు. పోలింగ్ మధ్యలో మొరాయించినా ఈవీఎంలకు మరమ్మతులు చేసినా ప్రారంభంకాకపోతే కొత్త ఈవీఎంను ఏర్పాటుచేస్తారు. అయితే అప్పటి వరకు పోలైన ఓట్ల వీవీ ప్యాట్లను భద్రపరుస్తారు. ఓట్ల లెక్కింపు అనంతరం వీవీ ప్యాట్లతో ఫలితాలు తారుమారు అయ్యే అవకాశం ఉంటేనే ఈ వీవీ ప్యాట్లను లెక్కిస్తారు. అలాగే వేసిన ఓటును ఏడు సెకండ్ల వ్యవధిలో పరిశీలించుకునే అవకాశం ఓటరుకు లభిస్తుంది. ఏమైనా తేడా అనిపిస్తే ప్రిసైడింగ్‌అధికారికి ఫిర్యాదు చేయవచ్చు.

ఆరు గంటల వరకే అనుమతి..

సాయంత్రం ఆరుగంటలకు పోలింగ్ ముగిస్తుంది. అప్పటి వరకే ఓటర్లను పోలింగ్‌కేంద్రంలోకి అనుమతి ఇస్తారు. పోలింగ్ కేంద్రంలో ఉన్నవారంతా ఓటు వేసేవరకు పోలింగ్ కొనసాగుతుంది. పోలింగ్ ముగిసిన వెంటనే పీవో సీయూలో క్లోజ్ బటన్ నొక్కుతారు. అనంతరం పోలైన ఓట్లలెక్కలు సరిచూసుకుంటారు. సరిచూసుకొని సీయూ స్విచ్ ఆఫ్ చేసి వీవీప్యాట్, బ్యాలెట్ యూనిట్లను డిస్‌కనెక్ట్ చేసి వీవీ ప్యాట్ నుంచి బ్యాటరీ తీసివేస్తారు. పోలింగ్‌ప్రారంభంలో సీయూ, వీవీ ప్యాట్‌కు వేసిన సీలు సక్రమంగానేఉన్నాయని పరిశీలించాక, పోలింగ్ ఏజెంట్లతో సంతకాలు తీసుకుంటారు. అనంతరం సీలు వేసి క్లోజ్ చేసిన సీయూ, బీయూ, వీవీ ప్యాట్లను ప్రత్యేక భద్రత నడుమ ఓట్ల లెక్కింపు కేంద్రాలలోని స్ట్రాంగ్ రూములకు తరలిస్తారు.



ఎక్కడకెళ్లినా ఎన్నికల చర్చలే..

మెళియాపుట్టి: ఎన్నికల ఫీవర్ జనాలకు పట్టుకుంది. ఎక్కడకెళ్లినా, ఎవరి నోట విన్నా ఎన్నికల చర్చలే కనిపిస్తోన్నాయి. గ్రామాలు, హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, సెలూన్ షాపులు.. ఇలా ఎక్కడ చూసినా రాజకీయంపైనే చర్చ జరుగుతోంది. ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది, ఆ నియోజకవర్గంలో ఎవరు గెలుస్తారు.. ఈ నియోజకవర్గంలో ఎవరిది విజయం, ఎంత మెజార్టీ వస్తుందంటూ చర్చించుకోవడం కనిపిస్తోంది.

నమ్మకస్తులకే డబ్బు పంపిణీ బాధ్యత..

మెళియాపుట్టి: జిల్లాలో అధికార పార్టీకి చెందిన ఓ మహిళా అభ్యర్థికి చెందిన డబ్బులు రూ.80 లక్షలు ఐదు రోజుల క్రితం ఓ నాయకుడి వద్ద ఉంచినట్లు సమాచారం. రెండు రోజుల తరువాత ఓటర్లకు పంచేందుకు ఆ డబ్బులను ఆమె అడిగితే దొంగలు పట్టుకొని పోయారని చెప్పడంతో ఆ నేత ఖంగుతిన్నట్లు తెలిసింది. దీంతో ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయలేక, ఎవరికి చెప్పుకోలేక లోలోపల కుమిలిపోతున్నట్లు తెలుస్తోంది. దీంతో ఆ నేత మరోసారి మోసానికి గురికాకుండా ఉండేందుకు తనకు అత్యంత నమ్మకస్తులైన వారికి ఓటర్లకు డబ్బుల పంపిణీ బాధ్యతను అప్పగించినట్లు తెలిసింది. నాలుగు ప్రాంతాల్లో నలుగురి వద్ద డబ్బులను నిల్వచేసి ఆ తాళాలు మాత్రం తన వద్దే ఉంచుకున్నట్లు వినికిడి. ఈ పరిస్థితి జిల్లాలోని మిగతా అభ్యర్థులు ఎదుర్కొంటున్నారు. శనివారంతో ఎన్నికల ప్రచారం ముగిసింది. దీంతో అభ్యర్థులు ప్రలోభాలకు తెరతీశారు. గత ఎన్నికల్లో ఎవరైతే నమ్మకంతో ప్రతి ఓటరుకు నగదు అందించారో అటువంటి నేతలకే ఈసారి కూడా ఆ బాధ్యతలను అభ్యర్థులు అప్పగిస్తోన్నారు. ఓటర్లందరికీ ఒకేలా కాకుండా కేటగిరీ వారిగా విభజించి నగదు పంచాలని వీరు భావిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీపై అభిమానంతో కచ్చితంగా తమకే ఓటు వేస్తారు.. డబ్బులిస్తేనే ఓటు వేస్తారు.. నగదు ఇచ్చినా ప్రత్యర్థి పార్టీకే ఓటు వేస్తారు.. ఇలా మూడు రకాలుగా ఓటర్లను విభజించి డబ్బులు పంచాలని చూస్తున్నారు. జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో ఇటువంటి పరిస్థితులే కనిపిస్తున్నాయి.

పేరు వలంటీర్లది.. డబ్బులు ఆ నాయకుడికి!

మెళియాపుట్టి: నియోజకవర్గ కేంద్రం పాతపట్నంలో అధికార పార్టీకి అనుకూలంగా రాజీనామాలు చేసి వైసీపీ అభ్యర్థి కోసం ప్రచారం చేస్తున్న గ్రామ వలంటీర్లకు ఓ నేత సున్నాం రాశాడనే ప్రచారం జరుగుతోంది. రాజీనామాలు చేసి పోలింగ్ ఏజెంట్లుగా ఉంటే ఒక్కొక్కరికి రూ.10 వేలు నుంచి రూ.20 వేలు వరకు అందిస్తామని ఆ నేత వలంటీర్లకు ఆశ చూపాడు. దీంతో చాలామంది వలంటీర్లు రాజీనామా చేశారు. వీరికి ఇస్తామన్నా డబ్బులను సదరు నాయకుడు అభ్యర్థి నుంచి తీసువెళ్లినట్లు తెలుస్తోంది. కానీ, ఆ నగదు మాత్రం వలంటీర్లకు అందలేదు. దీంతో వారు ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని ఎవరైనా అడిగితే 'నేనే మీకు వలంటీర్లగా వేయించాను. పార్టీ అధికారంలోకి వస్తే మళ్లీ మీకే వలంటీర్లగా అవకాశం ఇస్తా. అంతేగానీ డబ్బులు మాట మాత్ర ఎత్తొద్దు' అంటూ తేల్చిచెబుతుండడంతో ఏం చేయాలో వలంటీర్లకు తోచడం లేదు. తమను మోసం చేసిన నాయకుడికి ఓటు ద్వారా సమాధానం చెప్పేందుకు వలంటీర్లు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

గెలుపు భారం దేవుడిదే..



మెళియాపుట్టి: కొందరు అభ్యర్థులు తన గెలుపు భారాన్ని దేవుళ్లపై వేశారు. తనను గెలిపించాలని దేవుళ్లను ప్రార్థించి ముడుపులు కట్టుతున్నట్లు తెలుస్తోంది. గెలిచిన తర్వాత మీ సన్నిధికి వచ్చి ముడుపులు చెల్లిస్తానని పూజలు చేస్తుండడం కనిపిస్తుంది. అభ్యర్థులతో పాటు వారి కుటుంబ సభ్యులు, బంధువులు కూడా దేవుళ్లను మొక్కడం కనిపిస్తుంది. కాగా, సోమవారం పోలింగ్ అనంతరం జూన్ 4న వెలువడే ఫలితాల వరకు తమకు టెన్షన్ తప్పదంటూ అభ్యర్థులు చెబుతున్నారు. ప్రచారంలో తమకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించిందని, ఫలితాలు అనుకూలంగా ఉంటాయని ఒకవైపు చెబుతున్నా లోలోపల వారిలో టెన్షన్ కనిపిస్తోంది.

పోల్ మేనేజ్‌మెంట్‌పై ఫోకస్

- ముఖ్యనేతలతో అభ్యర్థుల సమాలోచనలు
- ఇప్పటికే బూత్‌లకు చేరిన డబ్బులు



నరసన్నపేట: ప్రజలు ఏమనుకుంటున్నారు... మన పార్టీ పరిస్థితి ఎలా ఉంది.. ఓటుకు ప్రజలు ఎంత ఆశిస్తున్నారు.. అవతలి పార్టీ ఎంత ఇద్దామనుకుంటోంది... మన పార్టీ గెలుపుపై ఏమైనా సందేహాలు ఉన్నాయా... ప్రత్యర్థి ఎత్తులను ఎప్పటికప్పుడు గమనించాలి.. బూత్‌స్థాయిలో నిఘా పెంచండి.. కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి ఓటరును కలవండి.. ఇదీ ప్రస్తుతం అన్ని రాజకీయ పార్టీల్లో జరుగుతున్న చర్చ. పోలింగ్‌కు ఒకరోజే సమయం ఉండడంతో అభ్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ప్రధానంగా పార్టీలు పోల్ మేనేజ్‌మెంట్‌పై ఫోకస్ పెట్టాయి. అధికార పార్టీ ఈసారి ఎన్నికలను గతం కంటే చాలెంజ్‌గా తీసుకుని ఓటుకు ఎంతైనా ఇచ్చి ప్రజలను తమ వైపునకు తిప్పుకోవాలని ఉవ్విళ్లూరుతోంది.

నేతలతో సమాలోచనలు..


జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో ఎన్డీఏ కూటమి, వైసీపీ అభ్యర్థుల మధ్య హోరాహోరీ పోరుసాగుతోంది. శనివారంతో ప్రచారం ముగియడంతో ప్రలోభాలకు తెర తీశారు. ముఖ్యనేతలతో మండలాల వారీగా సమావేశమవుతున్నారు. బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలను సైతం మచ్చిక చేసుకుంటున్నారు. ఓటరు నాడి పట్టడం అంత సులువు కానప్పటికీ, బూత్‌స్థాయిలో ఉన్న నాయకుల చరిష్మాతో అభ్యర్థులు గెలుపుపై ఆశతో ఉన్నారు. దీనికోసం ప్రతిఓటుకు నోటు తప్ప కుండా ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. ఓటుకు రూ.వెయ్యి నుంచి రూ.2వేలు వరకు ఇస్తున్నట్లు సమాచారం. తమకు పక్కాగా పడే ఓట్లకు ఎంతైనా ఇచ్చేందుకు వెనుకాడడం లేదు. కొంత అసంతృప్తితో ఉన్న, ఇతర పార్టీ నాయకులతో మచ్చికగా ఉండే ఓటర్లకు తక్కువగా డబ్బులు ఇస్తున్నారు. దీంతో వన్‌సైడ్ ఓటర్లకు జాక్‌పాట్‌గా మారింది. ఇటువంటి ఓటర్లకు రూ.2వేలు వరకు ఇస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు ఆయా పార్టీలు బూత్‌లకు ఇప్పటికే డబ్బులను పంపించినట్లుగా తెలుస్తోంది.

ఫొటో చూసి.. ఓటేసేయ్..!

- గుర్తులు, పేర్ల గందరగోళానికి తెర
- ఈవీఎంలో అభ్యర్థుల చిత్రాలు

(నరసన్నపేట)

ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం మారుతున్న కాలానుగుణంగా ఎప్పటికప్పుడు సంస్కరణలకు ప్రాధాన్యమిస్తోంది. పారదర్శకంగా పోలింగ్ నిర్వహణ కోసం చర్యలు తీసుకుంటోంది. సోమవారం జరిగే సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో అనేక మార్పులు, చేర్పులు తీసుకొచ్చింది. ఓటర్లు తమ ఓటు ఎవరికి పడిందో తెలుసుకునేందుకు వీలుగా వీవీ ప్యాట్ల వినియోగిస్తున్నారు. దివ్యాంగులకు పోలింగ్ కేంద్రాలకు చేర్చేందుకు వీలుగా ప్రత్యేక వాహన సదుపాయం, ర్యాంపులు ఏర్పాటు చేశారు. అంధులు తమ ఓటు హక్కు బ్రెయిలీ లిపిలో వినియోగించుకునేందుకు సౌకర్యం కల్పించారు.


ఈవీఎంలు నమూనా

గందరగోళానికి తెర..

కొన్నిగుర్తులు ఒకేలా ఉండడం, ఒక నియోజకవర్గంలో పోటీచేసి అభ్యర్థులు ఒకరికంటే ఎక్కువ మందికి ఒకేపేర్లు లేదా గుర్తుపట్టలేనంత దగ్గరి పోలికలు ఉండడం తదితర కారణాలతో వృద్ధులు, నిరక్షరాస్యులు ఇబ్బందిపడకుండా ఉండేందుకు ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంది. ప్రస్తు తం జరుగుతున్న ఎన్నికల్లో ఈవీఎంల్లో అభ్యర్థి పేరు, గుర్తుతో పాటు 2.5 సెంటీమీటర్ల నిడివితో కూడి అభ్యర్థి ఫొటోను ఏర్పాటు చేసింది. నోటా వద్ద మాత్రం ఫొటో స్థానంలో ఖాళీ ప్రాంతం ఉంటుంది. ఓటువేసే సమయంలో ఎటువంటి గందరగోళానికి తావులేకుండా ఉండేందుకు ఈసీ ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా పోటీచేసే అభ్యర్థులు తాజాగా తీయించుకున్న స్టాంప్‌సైజ్ కలర్ ఫొటోను సంబంధిత రిటర్నింగ్ అధికారికి నామినేషన్ సమయంలో అందజేశారు. ఫొటో వెనకాల రంగులు లేకుండా బ్రాక్‌గౌండ్ పూర్తి తెల్లగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్నికల సంఘం ఆయా అభ్యర్థులకు సూచించడంతో నిర్ణీత ఫార్మెట్‌లోనే తమ ఫొటోలను అందజేశారు. దీంతో ఎన్నికల సంఘం అభ్యర్థుల ఫొటోలను ఈవీఎంలపై ముద్రించి సంబంధిత నియోజవర్గాలకు వాటిని చేరవేసింది.

జన కేతనం
ఆంధ్రజ్యోతి
ఆదివారం 12 మే 2024

ఓటర్ల స్లిప్పుల పంపిణీలో జాప్యం

హిరమండలం, మే 11: ఓటర్ల స్లిప్పుల పంపిణీలో జాప్యం నెలకొంది. పోలింగ్‌కు ఒక్క రోజే సమయం ఉన్నా ఇప్పటి వరకు ఓటరు స్లిప్పులు అందకపోవడంతో పలువురు ఆందోళన చెందుతున్నారు. ఓటర్ల స్లిప్పుల పంపిణీ దాదాపు పూర్తయిందని అధికారులు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం అందలేదని కొందరు ఓటర్లు పేర్కొంటున్నారు. కొత్తగా ఓటుహక్కు నమోదు చేసుకున్నవారికి ఈసారి ఎన్నికల గుర్తింపుకార్డులు అందకపోతే ఆన్‌లైన్‌లో ఓటు వివరాలను తెలుసుకొని ఏదైనా గుర్తింపు కార్డుతో ఓటు వేయాల్సి ఉం టుంది.ఓటరుస్లిప్పులు లేకపోతే ఓటుహక్కు లేదన్న భావనతో ఓటు వేయకపోవడం, లేకపోతే పోలింగ్‌స్టేషన్ నంబరు తెలుసుకోవడంలో అవగాహన లేకపోవడంతో ఓటు వేసేందుకు కొందరు ఆసక్తి చూపించే అవకాశం ఉండదు. దీంతో ఓటింగ్ శాతం తగ్గే అవకాశముందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

- 2,358 కేంద్రాలు ఏర్పాటు
- ఓటు వేయనున్న 18.92 లక్షల మంది
- ప్రశాంత ఎన్నికలే లక్ష్యం
- జిల్లా ఎన్నికల అధికారి మన్‌జీర్ జిలానీ



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి మన్‌జీర్ జిలానీ సమూన్, ఎస్పీ జీఆర్ రాధిక

కలెక్టరేట్/శ్రీకాకుళం క్రైం, మే 11: పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. సోమవారం జరిగే పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి మన్‌జీర్ జిలానీ సమూన్ తెలిపారు. శనివారం తన కార్యాలయంలో ఎస్పీ జీఆర్ రాధిక, అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హింస, రీపోలింగ్‌కు తావులేకుండా ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండా ప్రతిఒక్కరూ చైతన్యవంతులై ఓటు వేయాలని కోరారు.

18,92,457 మంది ఓటర్లు

జిల్లాలో 8 నియోజకవర్గాల పరిధిలో 2,358 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 18,92,457 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 9,29,859 మంది, మహిళలు 9,45,945 మంది ఉన్నారు. సర్వీసు ఓటర్లు (సైనికోద్యోగులు) 16,448 మంది, 85 ఏళ్లు పైబడిన వారు 11,422 మంది, దివ్యాంగులు 21,546 మంది ఉన్నారు. పోలింగ్ శాతాన్ని పెంచేందుకు, ఓటర్లను ఆకర్షించే విధంగా 31 ఆదర్శ (మోడల్) పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసారు. ఇవి కాకుండా యువత కోసం 4, మహిళల కోసం పింక్ స్టేషన్లు 8, దివ్యాంగుల కోసం రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 520 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 268 మంది సెక్టార్ అధికారులు, 707 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించారు. నిరంతరాయంగా పోలింగ్ పరిస్థితిని సమీక్షించేలా ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 70.18 శాతం పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. 1655 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ జరుగనుంది. నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా, ఇంటర్‌నెట్ ఉండేలా పూర్తి చర్యలు తీసుకున్నారు. అలాగే 333 మంది వీడియోగ్రాఫర్ల సహాయంతో పోలింగ్ సరళిని ఎప్పటి కప్పుడు చిత్రీకరించనున్నారు. వేసవి దృష్ట్యా పోలింగ్ కేంద్రాల వద్ద షామియానాలు, చల్లటి నీరు, ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. దివ్యాంగులు, వృద్ధుల కోసం 1741 వీల్ ఛైర్లు సిద్ధం చేశారు. పోలీసుల బందోబస్తు సహా మొత్తం వెయ్యి వాహనాలను రవాణాకు సిద్ధం చేశారు. 268 రూట్లలో ఇవి 2,358 పోలింగ్ కేంద్రాలను కవర్ చేస్తాయి. జీపీఎస్ ఆధారిత ఈ వాహనాలు పోలింగ్ సామగ్రితో పాటు సిబ్బందిని ఆయా కేంద్రాల వద్ద దించడం, పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యాక తీసుకు రావడం చేస్తాయి. చిలకపాలెంలోని శివానీ ఇంజనీరింగ్ కళాశాలలో రిసెప్షన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గత ఎన్నికల్లో నెలకొన్న ట్రాఫిక్ ఇబ్బందుల దృష్ట్యా ఈసారి మరింత పకడ్బందీగా చర్యలు చేపట్టారు. జూన్ 4న అక్కడే కౌంటింగ్ జరగనుంది. పోలింగ్ రోజున, ముందు రోజు కూడా జిల్లా ప్రధాన కేంద్రంలో అందుబాటులో అధికారులు ఉంటారు. ఏమైనా సమస్య తలెత్తితే 18004256625 నెంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలి. ఓటర్లకు సంబంధించిన సమాచారం కోసం 1950 నెంబరును సంప్రదించాలి, ఎవరైనా ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే వాటి వీడియోలు, ఫోటోలను నేరుగా సి-విజిల్ యాప్‌కు పంపించాలి. అందిన 100 నిమిషాల్లోగా సంబంధిత అధికారులు అక్కడకు చేరుకుని వాటిని అడ్డుకుంటారు.

2వేల మంది పోలీసులతో బందోబస్తు

పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు 2వేల మంది పోలీసులు, 11 పారా మిలటరీ బృందాలు, 2 ప్లాటూన్లతో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ జీఆర్ రాధిక తెలిపారు. 4 అంతర జిల్లాల చెక్‌పోస్టులు, నియోజకవర్గానికి మూడు చొప్పున 24 ఎస్‌ఎస్‌టీ, ఎఫ్‌ఎస్‌టీ బృందాలు పనిచేస్తున్నాయని చెప్పారు. ఇప్పటివరకు రూ.4.39 కోట్ల విలువైన బంగారం, నగదు, వెండి, మద్యం, తదితర సామగ్రిని సీజ్ చేశామన్నారు. 4,624 మందిపై ముందస్తుగా బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల ప్రవేశ మార్గం నుంచి 200 మీటర్ల పరిధి వెలుపల మాత్రమే తాత్కాలిక రాజకీయ పార్టీలు కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవాలని, ఆ ప్రదేశంలో ఎక్కువ మంది గుమిగూడి ఉండరాదని చెప్పారు. నియోజకవర్గాల్లో బయట వ్యక్తులు ఎవరూ ఉండకూడదని, లాడ్జీలు, ప్రైవేటు గెస్ట్ హౌస్‌ల్లో ఉండేవారు వెళ్లిపోవాలని స్పష్టం చేశారు.

మేమెందుకు ఓటేయాలి?

- పోలింగ్‌ను బహిష్కరిస్తామన్న కేరాశింగి, గూడ గిరిజనులు



కేరాశింగి గిరిజనులతో మాట్లాడుతున్న అధికారులు

మెళియాపుట్టి: తమ గ్రామాలకు రహదారులు, తాగునీటి సదుపాయం లేదని, సోమవారం పోలింగ్‌ను బహిష్కరిస్తామని కొండలపైన ఉన్న కేరాశింగి, గూడ గిరిజనులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న అధికారులు శనివారం ఆయా గ్రామాలకు చేరుకుని వారికి నచ్చజెప్పారు. శనివారం ఉదయం సెక్టోరియల్ అధికారి దానకర్ణుడు ముందుగా కొండపైన ఉన్న కేరాశింగిలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటుచేయడానికి వెళ్లారు. అయితే అక్కడ గిరిజనులు మేము ఓట్లు వేయబోమని, ఏర్పాట్లు ఏమి చేయవద్దని ఆయనకు తెలియజేశారు. ఈ విషయం మండల అధికారుల దృష్టికి ఆయన తీసుకు వెళ్లారు. దీంతో తహసీల్దార్ జానమ్మ, సీఐ నల్లి సాయితోపాటు అధికారుల బృందం కేరాశింగి గ్రామానికి చేరుకుని వారి సమస్యలపై మాట్లాడారు. సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని అధికారులు తెలియజేయడంతో ఓటింగ్‌లో పాల్గొవడానికి గిరిజనులు ఒప్పుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.భాస్కర రావు, ఎస్ఐ టి.రాజేష్, ఏపీఎం ఎ.లలిత, వీఆర్వో శ్యామిల్, కార్యదర్శి వనజాక్షి తదితరులు పాల్గొన్నారు.

ఒకే గది.. ఒకే మార్గం

- 26 మంది ఏజెంట్లు వస్తే పరిస్థితి ఏమిటి?
- నందికొండలోని 180 పోలింగ్ కేంద్రంలో పరిస్థితి

సరుబుజ్జిలి: సరుబుజ్జిలికి ఆనుకుని ఉన్న నందికొండ ప్రాథమిక పాఠశాలలో గల 180 పోలింగ్ కేంద్రం ఒకే గదిలో ఏర్పాటుచేశారు. దీనిలోపలికి వచ్చిపోవడానికి కూడా ఒకే మార్గం ఉంది. దీంతోఓటు వేయడానికి వచ్చే ఓటర్లకు తీవ్ర ఇబ్బందులు తప్పవని గ్రామస్థులు చెబుతున్నారు. ఈ పోలింగ్ కేంద్రం పరిధిలో 729 మంది ఓటర్లు ఉండగా, ఒకే గదిలో ఉన్న నంది కొండ ప్రాథమిక పాఠశాలను అధికారులు గుర్తించారు. అయితే ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో 13 మంది చొప్పున అభ్యర్థులు లోక్‌సభ, అసెంబ్లీ బరిలో అభ్యర్థులు ఉన్నారు. వీరి తరఫున పోలింగ్ జరిగే రోజున 26 మంది పోలింగ్ ఏజెంట్లు హాజరైతే ఒకే గదిలో ఎలా ఉండగలరన్న సందేహాలు నెలకొన్నాయి. సిబ్బంది, ఏజెంట్లు, రెండు ఈవీఎం మిషన్లలో ఒకేగదిలో ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా ఇదే పాఠశాలకు సంబంధించిన ఫర్నీచర్, ఇతర సామగ్రి కూడా అదే గదిలో ఉంచారు. నందికొండలో పలు ప్రభుత్వ భవనాలు ఉన్నా 729 మంది ఓటర్లకోసం ఇరుకు గదిలో పోలింగ్ కేంద్రం ఏర్పాటులో ఆంతర్యమేమిటని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు.



ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌లో దిగిన వలస ఓటర్లు

ఓటు పండగ కోసం..

- స్వగ్రామాలకు చేరుకుంటున్న వలస ఓటర్లు
- కిటకిటలాడుతున్న రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు

(ఆమదాలవలస/పలాసరూరల్/వజ్రపుకొత్తూరు/ఇచ్ఛాపురం)

ఓటు పండగ కోసం వలస ఓటర్లు స్వగ్రామాలకు చేరుతున్నారు. సోమవారం పోలింగ్ రోజు ఓటు వేసేందుకు చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, కోల్‌కత్తా తదితర ప్రాంతాల్లో ఉన్న జిల్లా వలస ఓటర్లు పెద్ద సంఖ్యలో స్వగ్రామాలకు వస్తోన్నారు. విశాఖ, ఫలక్‌నుమా, కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లలో ఆమదాలవలస, పలాస, ఇచ్ఛాపురం, తదితర రైల్వే స్టేషన్లలో దిగుతున్నారు. అలాగే ట్రావెల్ బస్సుల్లో కూడా వస్తోన్నారు. దీంతో రైల్వే స్టేషన్లు, బస్సు స్టేషన్లు కిటకిటలాడుతున్నాయి. వలస ఓటర్లను రప్పించడానికి అభ్యర్థులు ఖర్చుకు వెనుకాడడంలేదు. ఎంత దూరంలో ఉన్న, ఎంత ఖర్చైనా రప్పిస్తున్నారు.



ఓటు వేయడం నా బాధ్యత

నాకు ఓటు హక్కు ఉంది. దీన్ని వినియోగించుకోవడం నా బాధ్యత. నేను విశాఖపట్నంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాను. ఓటు వేసేందుకు శనివారం మా గ్రామానికి వచ్చాను. సోమవారం ఓటు హక్కును వినియోగించుకుని తిరుగుప్రయాణం అవుతాను. సుదూర ప్రాంతాల్లో ఉన్న నా మిత్రులకు ఫోన్‌చేసి ఓటుహక్కు వినియోగించుకోవాలని కోరాను.

-బూరగాపు సాగర్, చినవంక గ్రామం, వజ్రపుకొత్తూరు మండలం

ఎలాగైనా ఓటు వేయాలని వచ్చాను



రాజమండ్రి నుంచి ఓట్లు వేసేందుకు స్వగ్రామం వచ్చాను. ఓట్లు అనేవి ఎప్పుడు రావు కదా. ఐదు సంవత్సరాలకు ఒక్కసారి వస్తాయి. ఈదఫా ఎలాగైనా ఓటు వేయాలని వచ్చాను. పిల్లలు, పేదల భవిష్యత్ కోసం పాటుపడే ప్రభుత్వం రావాలి.

- సాధు రాములమ్మ, జమ్ము, సరసన్నపేట



మార్పు జరగాలి

హైదరాబాద్‌లో భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్న భామిని మండలంలోని బాలేరు గ్రామానికి చెందిన శనక వెంకటరమణ, మర్రి సూరిబాబు శనివారం శ్రీకాకుళం రైల్వే స్టేషన్‌లో దిగారు. తెలంగాణలో ప్రజలు కోరుకున్న మాదిరిగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా మార్పు జరగాలన్న ఉద్దేశంతో ఓటు వేయడానికి వచ్చినట్లు వారు తెలిపారు.

-శనగ వెంకటరమణ, మర్రి సూరిబాబు, బాలేరు

కోల్‌కత్తా నుంచి వచ్చాం



బూర్జ మండలంలోని కోనంపేటకు చెందిన పలువురు వలస ఓటర్లు శనివారం శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్‌లో దిగారు. సోమవారం జరగనున్న ఎన్నికల్లో ఓటు వేయడా నికి కోల్‌కత్తా నుంచి వచ్చినట్లు కోనంపేటకు చెందిన యతిరాజుల జనార్దనరావు ఆయన భార్య సుభాషిణి తెలిపారు.

- సుభాషిణి, కోనంపేట, సరుబుజ్జిలి



చంద్రబాబుకే మద్దతు

నేను మొదటిసారి ఓటుహక్కును వినియోగించు కుంటు న్నాను. మంచిపాలన అందించే చంద్రబాబుకు మద్దతుగా ఓటు వేసేందుకు వచ్చాను. ఇచ్ఛాపురం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న బెందాళం అశోక్, ఎంపీ అభ్యర్థి రామ్మోహన్‌నాయుడుకు సైకిల్ గుర్తుపై ఓటు వేయడమే కాకుండా మిగతా వారికి అవగాహన కల్పించి టీడీపీకే ఓటు వేసేటట్లు చేస్తా

- లోహిత, బొడ్డకాళి, బీటెక్ (విశాఖ)

ఓటు కోసం సెలవు పెట్టాను



నాకు 2019 నాటికే ఓటు హక్కు వచ్చింది. ఉద్యోగ రీత్యా రాలేక ఓటు హక్కును వినియోగించుకోలేకపోయాను. ఈసారి ఏలాగైనా ఓటు హక్కును వినియోగించుకోవాలని టీడీపీకి ఓటు వేసేందుకే రెండు రోజులు సెలవు పెట్టి స్వగ్రామానికి వచ్చాను.

- ప్రవీణ్, ఇచ్ఛాపురం, (సేఫ్టీ ఆఫీసర్ బళ్లారి)

ఫ్లెక్సీ కలకలం

- నరసన్నపేట వైసీపీ అభ్యర్థిని ప్రశ్నిస్తూ పలుచోట్ల ఏర్పాటు

(నరసన్నపేట)

నరసన్నపేటలో ఫ్లెక్సీలు కలకలం సృష్టించాయి. నరసన్నపేట వైసీపీ అభ్యర్థి ధర్మాన కృష్ణదాస్‌కు వ్యతిరేకంగా వీటిని ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీల్లో పలు ప్రశ్నలను ఆయనకు సంధించారు. కంబకాయి జంక్షన్ సమీపంలోని జాతీయ రహదారిపై అండర్ పాసైజ్ వంతెన వద్ద నిత్యం వందలాది మంది వాకర్స్ వచ్చే మార్గంలో మూడు చోట్ల ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ నా ప్రశ్నలకు సమాధానం చెప్పగలవా అని హెడ్డింగ్ పెట్టి 17 ప్రశ్నలను సంధించారు. శనివారం తెల్లవారు జామున వాకర్స్‌తో పాటు పలువురు ఆ ఫ్లెక్సీలను చదువుతూ కనిపించారు. ఈ ఫ్లెక్సీలను చదివిన వారు ఇంత జరిగిందా అని చర్చించుకుంటున్నారు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. మధ్యాహ్నం 12 గంటలకు గుర్తు తెలియని వ్యక్తులు వాటిని తొలగించారు.



ఫ్లెక్సీని ఆసక్తిగా చదువుతున్న వాకర్స్



కంబకాయి జంక్షన్ వద్ద అండర్ పాసైజ్ వంతెన వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ



టెక్కలి నియోజకవర్గం తిలారులో ఎన్నికల ప్రచారంలో కింజరాపు అచ్చెన్నాయుడు



అరసవల్లి: శ్రీకాకుళంలో రోడ్ షో నిర్వహిస్తున్న రామ్మోహన్‌నాయుడు, గొండు శంకర్

చివరిరోజు ప్రచార హోరు

ఎన్నికల ప్రచారానికి తెరపడింది. చివరి రోజు శనివారం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు ప్రచారాన్ని హోరెత్తించారు. కోటబొమ్మాళి మండలం తిలారులో టెక్కలి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కింజరాపు అచ్చెన్నాయుడు, ఆమదాలవలస మండలం రావికంటిపేటలో టీడీపీ అభ్యర్థి కూన రవికుమార్, పలాసలో టీడీపీ అభ్యర్థి గౌతు శిరీష, శ్రీకాకుళం నగరంలో ఎంపీ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్, రణస్థలం మండలం జేఆర్‌పురంలో బీజేపీ అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు ఎన్నికల ప్రచారం చేపట్టారు. తమకు ఓటేసి గెలిపించాలని ప్రజలను కోరారు. వైసీపీ ప్రభుత్వానికి బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు.

(టెక్కలి/ఆమదాలవలస/పలాస/అరసవల్లి/రణస్థలం)



రణస్థలం: జేఆర్‌పురంలో రోడ్ షోలో మాట్లాడుతున్న నడుకుదిటి ఈశ్వరరావు



ఆమదాలవలస: రావికంటిపేటలో కూన రవికుమార్‌కు హారతులు ఇస్తున్న మహిళలు



పలాసలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న గౌతు శిరీష

ఓటమి భయంతో అసత్యాల ప్రచారం

● ఎంపీ రామ్మోహన్, శ్రీకాకుళం ఉమ్మడి అభ్యర్థి గొండు శంకర్



బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎంపీ రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్

అరసవల్లి: ప్రజా సంక్షేమం పట్టని వైసీపీ నేతలకు ప్రజలు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని, ఐదేళ్లలో జరిగిన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు టీడీపీపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఉమ్మడి పార్టీల ఎంపీ, శ్రీకాకుళం ఎమ్మెల్యే అభ్యర్థులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, గొండు శంకర్ అన్నారు. ప్రచారం చివరిరోజు శ్రీకాకుళం నగరంతో పాటు రూరల్ మండలాల్లో భారీ బైక్ ర్యాలీని టీడీపీ-జనసేన-బీజేపీ నేతలు, కార్యకర్తలు చేపట్టారు. ఎండను కూడా లెక్క చేయకుండా నేతలకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాయ మాటలతో ఇంకెన్నాళ్లు ప్రజలను మోసం చేయగలరని, వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయన్నారు. దేశంలో ఎక్కడా అమలులో లేని ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రాష్ట్రంలో హడావుడిగా ఎందుకు అమలు చేయాల్సి వచ్చిందో సీఎం జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టారని, ఇప్పుడు ప్రజల ఆస్తులను కబ్జా చేసేందుకు ఈ చట్టాన్ని తెచ్చారని, అటువంటి వారికి మరలా అవకాశం ఇస్తే ఇక రాష్ట్రంలో ఎవరికీ ఏమీ మిగలదని విమర్శించారు. ప్రధాని మోదీ, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సహకారంతో చంద్రబాబు రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపి, సంక్షేమ రాజ్యాన్ని స్థాపిస్తారన్నారు. ఎంపీగా తనను, ఎమ్మెల్యేగా గొండు శంకర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని రామ్మోహన్ నాయుడు కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అభివృద్ధి చేస్తా.. ఆశీర్వదించండి

● నరసన్నపేట ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి

నరసన్నపేట: నరసన్నపేట నియోజవర్గానికి జిల్లాలోనే గుర్తింపు తెచ్చేలా అభి వృద్ధి చేస్తానని, ఆశీర్వదించాలని నరసన్నపేట కూటమి అభ్యర్థి బగ్గు రమణ మూర్తి ఓటర్లను అభ్యర్థించారు. శనివారం పట్టణంలో వాకర్స్ కలాసీ యూనియన్ నాయ కులు, భవన నిర్మాణ కార్మికులతో కలిసి మాట్లాడారు. టీడీపీతోనే అభివృద్ధి సాధ్య మని, సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. పట్టణంలో ఇండోర్ స్టేడియంతో పాటు వాకర్స్‌కు రాజుల చెరువును గట్టును అభివృద్ధి చేసి పార్కుగా తయారు చేయడం జరుగుతుందన్నారు. రాజకీయాల్లో నిజా యితీగా ఉండే వ్యక్తులకే ఓటు వేయాలన్నారు. తనను ఎమ్మెల్యేగా, రామ్మోహన్ నాయుడును ఎంపీగా సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్ర మంలో టీడీపీ నాయకులు గొద్దు చిట్టి బాబు, కింజరాపు రామారావు తదితరులు పాల్గొన్నారు.



భవన నిర్మాణ కార్మికులతో మాట్లాడుతున్న ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి

వైసీపీ నిరంకుశ విధానాలతో నష్టం

● టెక్కలి ఉమ్మడి అభ్యర్థి అచ్చెన్నాయుడు



అచ్చెన్నాయుడుకు హారతి ఇస్తున్న మహిళలు

టెక్కలి: గడచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వ నిరంకుశ విధానాల వల్ల అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారని, ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెప్పాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఉమ్మడి అభ్యర్థి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం కోటబొమ్మాళి మండలం తిలారు తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, ఈ రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం అవసరమని అన్నారు. ఈ ఎన్నికల్లో కూటమి విజయం ఖాయమన్నారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామాల్లో అపూర్వ స్వాగతం లభించింది. సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రామ్మోహన్ నాయుడును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. జనసేన కార్యకర్తలతో కలిసి వివిధ ప్రాంతాల్లో బైక్‌ర్యాలీ నిర్వహించారు. అచ్చెన్నాయుడు సతీమణి విజయ మాధవి కుటుంబసభ్యులతో కలిసి నిమ్మాడ తదితర ప్రాంతాల్లో, కుమారుడు కృష్ణ మోహన్‌నాయుడు, నిమ్మాడ సర్పంచ్ కింజరాపు సురేష్ బన్నువాడలో ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమాల్లో ఆయకులు వెలమల విజయలక్ష్మి, తర్ర రామకృష్ణ, నంబాళ్ల రాజశేఖర్, శ్రీనివాస్, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తా

● పలాస ఉమ్మడి అభ్యర్థి గౌతు శిరీష

పలాస/కాశీబుగ్గ: పలాస నియోజకవర్గంలో అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తానని, మహిళగా పోటీ చేస్తున్న తనకు ఒక్క అవకాశం ఇచ్చి గెలిపించాలని పలాస ఉమ్మడి పార్టీల అభ్యర్థి గౌతు శిరీష అభ్యర్థించారు. పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత పాలకులు పలాసను అభివృద్ధి పేరుతో దోచుకు న్నారని విమర్శించారు. ఒక్క చాన్స్‌తో వైసీపీని గెలిపిస్తే రాష్ట్రాన్ని 20 ఏళ్ల వెనక్కు తీసుకెళ్లారని ఆవే దన వ్యక్తం చేశారు. పలాస నియోజకవర్గంలో ఒక్క అభివృద్ధి పని కూడా పూర్తి చేయలేకపోయారని, అభివృద్ధి మంత్రం వారు వల్లిస్తుండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోం దన్నారు. తనను గెలిపిస్తే ఐదేళ్లలో అభివృద్ధి చేసి చూపిస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావుయాదవ్, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, దడియాల నర్సింహులు, సవర రాంబాబు, డొక్కరి శంకర్, టంకాల రవిశంకర్‌గుప్తా, మల్లా శ్రీనివాస్, దానేటి పద్మజ తదితరులు పాల్గొన్నారు.



పద్మనాభపురంలో మాట్లాడుతున్న గౌతు శిరీష

ఉమ్మడి ప్రభుత్వంలో డీఎస్సీ

● ఆమదాలవలస కూటమి అభ్యర్థి కూన రవికుమార్



టీడీపీలో చేరిన వారితో కూన రవికుమార్

ఆమదాలవలస: రాష్ట్రంలో ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎటువంటి ఉద్యోగాలు కల్పించకపోవడంతో నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారని, ఉమ్మడి ప్రభుత్వంలో డీఎస్సీ ఫైనే చంద్రబాబు నాయుడు తొలి సంతకం చేయనున్నా రని ఆమదాలవలస అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి కూన రవికుమార్ అన్నారు. శనివారం మునిసిపాలిటీ రావికంటిపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. యువకులు, నిరుద్యోగులు, విద్యావంతులు, మేథావులు రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ధర్మానికి, అధర్మానికి జరుగుతున్న ఈ ఎన్నికల్లో తీర్పు ఇవ్వాలని కోరారు. పాలనను ఛిన్నా భిన్నం చేసిన సైకో సీఎం జగన్ రెడ్డికి ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. టీడీపీ సూపర్‌సిక్స్ పథకాల్లో మహిళలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం జరిగిందని, రాష్ట్రంలో డ్వాక్రా సంఘాలను ప్రవేశపెట్టిన చంద్రన్నకు మహిళలందరూ ఆశీర్వదించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రామ్మోహన్ నాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పేడాడ సూరపు నాయుడు, తమ్మినేని గీతా విద్యాసాగర్, పాతిన గడ్డెయ్య, అన్నెపు ధనుంజయరావు పాల్గొన్నారు.

● పొందూరు మండలం సింగూరు గ్రామానికి చెందిన దుప్పల గణపతి ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు మెట్ట శ్యామలరావు, తమ్మినేని కామేశ్వరరావు, సేపాన రమణారావు, సింగూరు ఉపేంద్ర రావు, మెట్ట జ్ఞానేశ్వరరావులతో పాటు 80 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. ఆమదాలవలస పార్టీ కార్యాల యంలో జరిగిన కార్యక్రమంలో వీరికి పార్టీ అభ్యర్థి కూన రవికుమార్ కండు వాలు వేసి ఆహ్వానించారు. టీడీపీ విజయానికి సహకరించాలని ఆయన కోరారు.

నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి: అశోక్



ఇచ్ఛాపురం: నియోజకవర్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తానని, తనను మరోసారి ఆశీర్వదించాలని ఇచ్ఛాపురం కూటమి అభ్యర్థి బెందాళం అశోక్ కోరారు. శనివారం బెల్లుపడ గ్రామంలో విస్తృతం గా పర్యటించి ప్రచారం చేశారు. గ్రామంలోని ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మీ అందరి ఆశీర్వాదంతో హ్యాట్రిక్ విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పెట్టిందన్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు, టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు కాళ్ల ధర్మారావు, నందికి జాని, నేతలు కొండా శంకర్‌రెడ్డి, లీలారాణి, రెయ్యి జానికిరావు, ఆశి జీవులు రెడ్డి, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వైశ్య కులస్థులను బీసీల్లో చేర్చిన ఘనత టీడీపీదే

టెక్కలి: వైశ్య కులస్థులను బీసీల్లో చేర్చిన ఘనత టీడీపీదేనని, ఈసారి అధికారంలోకి వచ్చిన తరువాత ఓబీసీల్లో చేర్చేందుకు కృషి చేయడం జరుగుతుందని రాష్ట్ర కళింగ వైశ్య సంఘ నాయకులు బోయిన గోవిందరాజులు అన్నారు. శనివారం కోటబొమ్మాళిలో కళింగ వైశ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైశ్యుల సంక్షేమం కోసం పాటు పడిన కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. ఇచ్చిన హామీలు నిలబెట్టుకునే శక్తి ఒక్క కింజరాపు కుటుంబానికి మాత్రమే ఉందని, అందుకే టీడీపీకి అండగా ఉండాలని కోరారు. సమావేశంలో కళింగ కోమట్ల సాధికార కన్వీనర్ జామి వెంకటరమణ, వైశ్య సంఘ నాయకులు సానా షణ్ముఖరావు, లాడి శ్రీనివాస్, నారా యణశెట్టి శ్రీనివాస్, పెద్దబాబు, కేవీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవత ఉత్సవాలు ప్రారంభం

ఎల్.ఎన్.పేట: లక్ష్మీనర్సుపేటలో నిర్వహించనున్న గ్రామదేవత (బంగారు సంతోషి మాత) ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. అమ్మవారి మండపాన్ని గ్రామస్థులు పూలు, తోరణాలతో అలంకరించి పూజలు చేశారు. 18 రోజులపాటు గ్రామదేవత వివిధ రూపాల్లో దర్శనమిస్తారని, శాస్త్రోక్తంగా పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ ఎం.దివాకర్‌నాయుడు, పెద్దలు ఎం.జనార్దనరావు, వి.పాండురంగ నాథ రాజు, రాంనాథ్ పాణిగ్రాహి తదితరులు తెలిపారు.

స్నానానికి వెళ్లి.. కానరాని లోకాలకు

● వంశధార నదిలో బాలిక మృతి



సంజన (ఫైల్)

హిరమండలం: మండలంలోని కొత్త కొమనాపల్లి గ్రామానికి చెందిన తెంబూరు సంజన (9) వంశధార నదిలో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు గుమ్మిలో దిగి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ నారామణస్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన తెంబూరు వసంతరావు కంచిలి మండలం పీజే పురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. వేసవి సెలవుల నిమిత్తం స్వగ్రామం కొమనాపల్లికి కుటుంబంతో వచ్చారు. శని వారం తన కుమారుడు విక్రమాదిత్య పుట్టిన రోజు చేసిన అనం తరం సరదాగా భార్య ఉషారాణి, పిల్లలతో కలిసి పక్కనే ఉన్న రుగడ గ్రామ సమీపంలో ఉన్న వంశధార నదికి స్నానానికి వెళ్లారు. పిల్లలతో కలిసి నదిలో స్నానం చేస్తూ సబ్బు కోసం నారా యణస్వామి ఒడ్డుకు వచ్చారు. ఇంతలో రెండో కుమార్తె సంజన నదిలో కొంతదూరం వెళ్లింది. ప్రమాద వశాత్తు లోతట్టు ప్రాంతంలో జారి నీటిలో మునిగి కనిపించకుండా పోయింది. ఇది గమనించిన తల్లిదండ్రులు నీటిలో గాలించారు. కొంత సమయం తర్వాత మృతదేహం తండ్రికే నీటి అడుగు భాగంలో దొరికింది. దీంతో వారంతా కన్నీరుమున్నీరవుతున్నారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణ స్వామి తెలిపారు. వసంతరావుకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. మృతురాలు 3వతరగతి చదివి నాలుగో తరగతికి వస్తోంది.

రూ1.17 లక్షలు సీజ్

ఇచ్ఛాపురం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇచ్ఛాపురం బస్టాండ్ జంక్షన్‌లో ఎస్ఎస్‌టీ బృందం వాహనాలను తనిఖీ చేశారు. శనివారం డొంకూరు గ్రామానికి చెందిన మెగిలిపూరి భాస్కరరావు ఎటువంటి పత్రాలు లేకుండా అక్రమంగా తరలిస్తున్న రూ1.17 లక్షల నగదును పట్టుకున్నట్లు ఎస్ఎస్‌టీ బృందం కానిస్టేబుల్ తెలుకుల రామారావు తెలిపారు. ఈ సొమ్ము ను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించినట్లు చెప్పారు.



ఆర్వోకు నగదు అందిస్తున్న దృశ్యం

ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలి

● ఎచ్చెర్ల ఉమ్మడి అభ్యర్థి ఎన్.ఈశ్వరరావు



భారీ రోడ్ షోలో పాల్గొన్న ఎన్ఈఆర్

రణస్థలం: ఈనెల 13న నిర్వహించనున్న ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని ఉమ్మడి పార్టీ ఎచ్చెర్ల నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ఎన్నికల ప్రచారం చివరి రోజు శనివారం జేఆర్‌పురం పంచాయతీలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అడు గడు గునా ఆయనకు అపూర్వ స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా తనకు కమలం, విజయనగరం ఎంపీగా అప్పలనాయుడుకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్ర మంలో కూటమి నాయకులు లంక శ్యామలరావు, డీజీఎం ఆనందరావు, గొర్లె లక్ష్మణరావు, పిషిని జగ న్నాథంనాయుడు, కలిశెట్టి సూర్యనారాయణ, పైడి అప్పడదొర, దెయ్యం వసంతరావు, డీజీఎం శ్రీను, కొప్పిశెట్టి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఇంటింటా ప్రచారం

ఎచ్చెర్ల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు, ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడులను గెలిపించాలని కోరుతూ శనివారం ఎచ్చెర్ల మండలం అరిణాం అక్కివలసలో ఉమ్మడి పార్టీల నేతలు ప్రచారం నిర్వహించారు. కార్యక్ర మంలో కూటమి నేతలు గట్టెం శివరామ్, రమేష్, శ్రీను, రామారావు, శంకర్, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి



బలరాం (ఫైల్)

నందిగాం: పెద్దతామరాపల్లి సమీపంలో హైవేపై శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. నందిగాం గణేష్ కాలనీకి చెందిన మతిస్థిమితం కోల్పోయిన రాజాపు బలరాం (80) నందిగాం నుంచి టెక్కలి వైపు నడిచి వెళ్తుండగా అదే మార్గంలో గుర్తుతెలియని వాహ నం ఢీకొనడంతో తీవ్రగాయాలకు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. కుమారుడు ప్రకాశరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహ్మద్ అమీర్ ఆలీ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, వివాహమైన కుమారులు, కుమార్తె ఉన్నారు.

ఆర్జీయూకేటీతో ఆర్వీ అసోసియేషన్ సంస్థ ఒప్పందం

ఎచ్చెర్ల: ఆర్జీయూకేటీలో ఇంజనీరింగ్ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు వేతనంతో కూడిన ఇంటర్న్‌షిప్ ఇచ్చేందుకు ఐఐటీ తిరుపతిలో ఆర్వీ అసోసియేషన్ అనే గ్లోబల్ సివిల్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్‌తో ఒప్పందం కుదిరింది. ఈ మేరకు ఆర్జీయూకేటీ చాన్సలర్ ప్రొఫెసర్ కేసీ రెడ్డి, వీసీ ప్రొఫెసర్ ఎం.విజయకుమార్, ఐఐటీ తిరుపతి డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ ఒప్పందం కుదుర్చుకున్నారు. తొలి విడతలో 12 మంది సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు నెలకు రూ.10 వేల వేతనంతో కూడిన ఇంటర్న్‌షిప్ ఇచ్చేందుకు ఈ ఒప్పందం కుదిరింది. కంప్యూటర్ సైన్స్ (సీఎస్ఈ) విద్యార్థులకు కూడా త్వరలో ఇంటర్న్‌షిప్ ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆర్జీయూకేటీ, శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కేవీజీడీ బాలాజీ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలుండాలి

కలెక్టరేట్: పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాల కల్పన పక్కాగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌లో పోల్ డే మేనేజ్‌మెంట్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాగునీరు, లైటింగ్, పీడబ్ల్యూడీ ఓటర్లకు సదుపాయాలు, జనరేటర్ తదితర ఏర్పాట్లు ఖచ్చితంగా చేయాలన్నారు. ఈవీఎంలపై దృష్టి సారించాలని, ఈవీఎంలు పనిచేయకుంటే వెంటనే సెక్టార్ అధికారులను సంప్రదించాలన్నారు. జీపీఎస్ ద్వారా వాహనాల సమాచారాన్ని ఎప్పటి కప్పుడు తెలుసుకోవాలన్నారు.

వెబ్ కాస్టింగ్ పరిశీలన పక్కాగా చేయాలి

వెబ్ కాస్టింగ్ పరిశీలన పక్కాగా జరగాలని జిల్లా ఎన్నికల అధికారి మన్‌జీర్ జిలానీ సమూన్ పేర్కొన్నారు. జీపీఎస్, వెబ్ కాస్టింగ్ పరిశీలకులతో కంట్రోల్ రూమ్‌లో సమావేశం నిర్వహించారు. జిల్లాలో దాదాపు 75 శాతం పోలింగ్ కేంద్రాలను వెబ్ కాస్టింగ్ కవరేజీలో ఉంచామని, ఫిర్యాదుల పరిశీలనలో వెబ్ కాస్టింగ్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ప్రతీ పోలింగ్ స్టేషన్‌లో రెండు కెమెరాలు ఉంటాయన్నారు. ప్రతీ పోలింగ్ స్టేషన్ నుంచి జిల్లా కేంద్రంలో ఉన్న కంట్రోల్ రూమ్‌కు పుటేజి రావాలని, పోలింగ్ కేంద్రాల వద్ద జరిగే ప్రతీ విషయం తెలియ జేయాలన్నారు. నెట్‌వర్క్ లేని ప్రాంతాల్లో వీడియో చిత్రీకరణ జరుగుతుందని, పుటేజీలను పరిశీలించాలన్నారు. సమావేశంలో కంట్రోల్ రూం నోడల్ అధికారి టి.వెంకటేశ్వరరావు, స్వీప్ నోడల్ అధికారి కిరణ్‌కుమార్, ఎంసీసీ నోడల్ అధికారి సీపీవో లక్ష్మీ ప్రసన్న, ఈవీఎంల నోడల్ అధికారి కె.సుధ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో ఇండియా కూటమిదే సర్కార్ : పేడాడ

పలాస: సార్వత్రిక ఎన్నికల్లో కేంద్రంలో రానున్నది ఇండియా కూటమి సర్కారేనని డీసీసీ అధ్యక్షుడు, శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేడాడ పరమేశ్వరరావు అన్నారు. శనివారం కాశీబుగ్గలో ఓ ప్రైవేటు కార్యాలయంలో సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా తనను, పలాస నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా మజ్జి త్రినాథబాబును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఇండియా కూటమి నాయకులు చాపర వేణు, గణపతి తదితరులు పాల్గొన్నారు.

ఓటు మనందరి బాధ్యత: సబ్ కలెక్టర్

టెక్కలి: ఓటు వేయడం మనందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరు వినియోగించు కోవాలని సబ్ కలెక్టర్, ఆర్వో నూరుల్ కమర్ అన్నారు. శనివారం టెక్కలిలో స్వీప్ ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా స్వామ్యంలో ఓటు బలమైనదని, మీ ఓటు మీ భవిష్యత్‌ను నిర్ణయిస్తుందన్నారు. అనంతరం జడ్పీరోడ్డు నుంచి ఇందిరాగాంధీ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈఆర్వో మురళీకృష్ణ, ఎంపీడీవో విజయకుమారి, ఏపీవో బగాది ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నందిగాం: నందిగాంలో ఓటుహక్కు వినియోగంపై శనివారం బైక్ ర్యాలీ నిర్వహిం చారు. వెలుగు, ఉపాధి, మండలపరిషత్ తదితర శాఖల ఉద్యోగులు బైక్ ర్యాలీలో పాల్గొ న్నారు. ఓటుహక్కు వజ్రాయుధమని, ప్రజాస్వామ్య పరిరక్షణకు దోహదపడుతుందంటూ నినదించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.శివప్రసాద్, ఏపీవో ఎం.నాగరాజు, ఏపీఎం కె.జాంబవతి పాల్గొన్నారు.

పాతపట్నం: ఓటుహక్కు వినియోగంపై అవగాహనకు శనివారం స్వీప్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కోర్టుకూడలి నుంచి బస్టాండ్ కూడలి వరకు బైక్ ర్యాలీ సాగింది. కార్యక్ర మంలో ఎంపీడీవో రామకృష్ణరాజు, వెలుగు ఏపీఎం మనోరత్నం తదితరులు పాల్గొన్నారు.

లావేరు: ప్రతి ఒక్కరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని వెలుగు ఏపీఎం మాధవీలత అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్టాప్ వరకు బైక్ ర్యాలీ చేశారు. ఓటు వజ్రాయుధమని, అందరూ ఈనెల 13న ఓటు వేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ విశ్వేశ్వ రరావు, ఏపీవో ఆర్.సత్యవతి, టీపీ నాయుడు పాల్గొన్నారు. ● **సోంపేట:** ఓటుహక్కు విలువ తెలియజేస్తూ మండల అధికారులు ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి శనివారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటుహక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ర్యాలీలో ఎంపీడీవో రామారావు, వెలుగు ఏపీఎం వీవీ రమణమ్మ, ఏపీవో ప్రమీల, వీవోఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌కు షోకాజ్ నోటీస్

సంతబొమ్మాళి: నౌపడ ఫీల్డ్ అసిస్టెంట్ బొమ్మాళి రామారావుకు షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు ఎంపీడీవో ఉమాసుందరి తెలిపారు. వైసీపీ రెడ్డి సామాజికవర్గ ఆత్మీయ సమావేశంలో రామారావు పాల్గొనడంతో పత్రికల్లో వార్తలు వచ్చిన నేపథ్యంలో నోటీసు అందజేశామన్నారు. రెండు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించినట్లు ఆమె తెలిపారు.

సీహెచ్‌సీకి వాటర్ ఫిల్టర్ వితరణ

ఇచ్ఛాపురం: ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి బంధువులు, సిబ్బంది వినియోగించుకునేందుకు గాను రోటరీ క్లబ్ సభ్యులు రూ.60 వేలు విలువ చేసే 100 లీటర్ల ప్యూరిఫైడ్ వాటర్ ఫిల్టర్‌ను అందజేశారు. శనివారం సీహెచ్‌సీలో ఫిల్టర్‌ను ఏర్పాటు చేసి సూపరింటెండెంట్ డాక్టర్ పి.దేవేంద్ర రెడ్డికి అప్పగించారు. కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ పి.దినేష్‌కుమార్, అధ్యక్షుడు రోహిత్, కార్యదర్శి రాజ్‌కుమార్, దక్కత కృష్ణమూర్తిరెడ్డి, నవీన్ చౌదరి, వెంకటేష్, ఎల్‌సీ రావు తదితరులు పాల్గొన్నారు.

